ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ:29.04.2025 సమయం:1310 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ – చత్తీస్ గఢ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా, ఆదివాసీల ప్రయోజనాల కోసం ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు.
2. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ అత్యద్భుతంగా రూపుదిద్దుకుంటోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.
3. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు సూచించారు.
4. రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ఆపరేషన్ కగార్:

తెలంగాణ – చత్తీస్ గఢ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా, ఆదివాసీల ప్రయోజనాల కోసం ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క అభిప్రాయపడ్డారు. శాంతియుత వాతావరణం నెలకొల్పే లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దు కర్రెగుట్టల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని భారత్ బాచావో సంస్థ ప్రతినిధులు ఈ ఉదయం హైదరాబాద్ లో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఒక ప్రకటనలో మంత్రి స్పందిస్తూ, శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యం గా ఉండాలన్నారు. ఆయా ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగం లోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయనీ, అక్కడి ఆదివాసీల శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వాలు చూడాలని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ కగార్ తో ఆదివాసీలు భయాందోళనతో ఉన్నారని, మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

(MSL)

కగార్-మావోయిస్ పార్టీ ప్రకటన

సమయ వ్యవధితో కూడిన కాల్పుల విరమణ ప్రకటించి, శాంతిచర్చలు జరపాలని, అందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని నిషేధిత సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని ఆయన విడుదల చేసిన లేఖలో కోరారు. గత ఏడాది జనవరి నుంచి కేంద్ర, రాష్ట్రాల పోలీసులు, పారా మిలటరీ, కమాండో దళాలు 'కగార్' పేరుతో వందలాది మావోయిస్టులు, అమాయక ఆదివాసీలను చంపారని, ఇది ఇంకా కొనసాగుతోందని తెలిపారు. కర్రి గుట్టల ప్రాంతాన్ని 10 వేల మంది పోలీసులు, పారా మిలటరీ, కమాండో దళాలతో దిగ్బంధించారని, తమ దళాలనేకాక మూడు గ్రామాలకు చెందిన ప్రజలను హింసిస్తున్నారని అభయ్ ఆరోపించారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

కిషన్ రెడ్డి-వరంగల్ రైల్వే స్టేషన్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా తెలంగాణలోని వరంగల్ రైల్వే స్టేషన్ అత్యద్భుతంగా రూపుదిద్దుకుంటోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి , బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి అన్నారు. ఈ రైల్వే స్టేషన్ కు సరికొత్త ముఖద్వారం, వరండాల నిర్మాణం జరుగుతోందని ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు, చిత్రాలను పంచుకున్నారు. 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు ప్లాట్‌ఫారమ్‌లు, మరుగుదొడ్ల అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్టులు, ఎస్కలేటర్లు, సైన్ బోర్డ్ ల ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ల్యాండ్ స్కేపింగ్, ట్రాఫిక్ పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

(డెస్క్)

కరీంనగర్ -మంత్రి పొన్నం ప్రభాకర్ అభివృద్ధి పనులు

రాష్ట్ర రవాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ రోజు కరీంనగర్ జిల్లాలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఉదయం సైదాపూర్ మండల పెర్కెపల్లిలో పెర్కెపల్లి నుంచి వెన్కేపల్లి వెళ్ళే రోడ్డుపై హైలెవల్ వంతెనను, పెర్కెపల్లి నుంచి దుద్దెనపల్లి వెళ్ళే రోడ్డు హైలెవల్ వంతెనకు మంత్రి శంకుస్థాపన చేశారు. వీలైనంత త్వరగా వంతెనల నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

(బైట్ పొన్నం ప్రభాకర్)

(పిటిసి, కరీంనగర్)

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

ఇంటర్ విద్యార్థికి పొన్నం సన్మానం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదువున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో MPCS గ్రూప్ లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన హుస్నాబాద్ పట్టణానికి చెందిన విద్యార్థి రాధారపు వైష్ణవి, ఆమె తల్లిదండ్రులను ఈరోజు వారి నివాసానికి వెళ్లి మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వైష్ణవి 470కి గాను 468 మార్కులు సాధించి ఈ ప్రాంత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.

(పీటీసీ, సిద్దిపేట)

భద్రకాళీ చెరువు పూడికతీత పనులు వేగవంతం

వరంగల్ జిల్లా భద్రకాళి చెరువు పూడికతీత పనులు జూన్ 15నాటికి పూర్తికావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో అధికారులు పనుల్లో వేగం పెంచారు. వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయటానికి హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ లు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పూడికతీత మట్టిని వేగంగా తరలించాలన్నారు. నిర్ణీత గడువులో పూడిక మట్టిని తరలించేందుకు అదనంగా రెండు టెండర్లను సత్వరమే ఆహ్వానించాలన్న మంత్రి సూచనతో ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇరు జిల్లాల కలెక్టర్లు, సాగునీటిపారుదల శాఖ అధికారులు ఈ రోజు చెరువును సందర్శించి పనుల పురోగతి వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

(వరంగల్ జిల్లా పి టి సి)

కొత్తగూడెం-ఏఎస్పీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. చర్ల పోలీసుల ఆధ్వర్యంలో ఈ రోజు చర్ల మండలం లోని చత్తీస్ గడ్ రాష్ట్ర సరిహద్దు

గ్రామమైన ఎర్రంపాడులో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలకు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విక్రాంత్ ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.

(PTC- B.KGM)

వాతావరణం

రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదే సమయంలో ఎల్లుండి నుంచి మే 5వ తేదీ వరకూ పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్క కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, జగిత్యాల, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కొమరం భీం, మహబూబ్ నగర్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో రాబోయే నాలుగు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మేరకు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. మిగిలిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మేర ఉంటాయని తెలిపింది.

(డెస్క్)

సిరిసిల్ల- వైద్య అధికారి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత అన్నారు.

(బైట్ డాక్టర్ రజిత)

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

వనపర్తి-పొంగులేటి పర్యటన

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రేపు వనపర్తి జిల్లాలో పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు చేస్తారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి తెలిపారు. అనంతరం భూ భారతి అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారని

పేర్కొన్నారు.  మంత్రి పర్యటన నేపథ్యంలో ఈ రోజు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి కార్యక్రమాల ఏర్పాట్లను, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు

(పిటిసి, వనపర్తి జిల్లా)

భద్రకాళీ - బ్రహ్మోత్సవాలు

వరంగల్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ రోజు ఘనంగా మొదలయ్యాయి. మే 10వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగతాయి.

(వరంగల్ జిల్లా పి టి సి)

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

****